సాక్షి
కుమురం భీం

శనివారం । 10 । జూన్ । 2023

నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, వేదికపై సీఎస్, మంత్రులు, ఎమ్మెల్యేలు





బతుకమ్మతో మహిళ



బహిరంగ సభకు హాజరైన జనం

అభివాదం చేస్తున్న కేసీఆర్

మంచిర్యాల గడ్డ నుంచే..!

• సంక్షేమ పథకాలు, శంకుస్థాపనలు • సంబురంగా సాగిన సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన • ఘనంగా కొత్త కలెక్టరేట్ ప్రారంభం

సాక్షి ప్రతినిధి,మంచిర్యాల: తెలంగాణకు ఈశాన్య ప్రాంతం మంచిర్యాలగడ్డ నుంచే సీఎం కేసీఆర్ సంక్షేమ దినోత్సవం రోజు దివ్యాంగులకు రూ.1,100 పింఛన్‌పెంపు,ఎంబీసీ కులవృత్తులకు రూ.లక్ష సాయం, సొంతిల్లు కట్టుకునే వారికి గృహలక్ష్మి కింద రూ.3లక్షల సాయం, రెండోవిడత గొర్రెల పంపిణీ ప్రారంభించి జిల్లా వాసులను మైమరిపించారు. సంక్షేమ సంబరాల్లోనే ప్రగతి నివేదన సభ నిర్వహించారు.

అట్టహాసంగా ప్రారంభోత్సవాలు

సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ జిల్లా నూతన కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మంత్రులు, ప్రజాప్రతినిధులు వెంట రాగా సీఎం కేసీఆర్ రిబ్బన్ కట్ చేసి బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం సీఎం కేసీఆర్ రిబ్బన్ కట్ చేసి సీఎస్, మంత్రులు, ప్రజాప్రతినిధులు,అధికారులతో కలిసి కలెక్టరేట్‌లోకి అడుగుపెట్టారు. కలెక్టర్ సంతోష్‌ను కుర్చీలో కూర్చోబెట్టి, పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను కలెక్టర్ శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సర్వమత ప్రార్థనల అనంతరం అధికారులను సీఎం శాలువాలతో సత్కరించారు.

మంచిర్యాలపై పాత జ్ఞాపకం

కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్‌కు పాత జ్ఞాపకం మనసులో తలక్కున మెరిసింది. 'మంచిర్యాల జిల్లా కావాలన్న డిమాండ్.. ఎన్టీఆర్ ఏ కారణం చేతనో చేయలేక పోయారు. భగవంతుని కృప మనందరం చేసిన పోరాటం, తెలంగాణ ఉద్యమ ఫలితం మనకు తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది కాబట్టి ఈ రోజు ఇవన్నీ కూడా మనం నెరవేర్చుకోగల్గినం' అని గుర్తు చేసుకున్నారు.

కేసీఆర్ దయతో జిల్లా



సీఎం కేసీఆర్ దయతో మంచిర్యాల జిల్లా ఏర్పడింది. అనేక అభివృద్ధి పనులు ఆయన నాయకత్వంలో జరుగుతున్నాయి. ఈ జిల్లాను గొప్పగా తీర్చిదిద్దుతున్నారు. కలెక్టరేట్, చెన్నూరు ఎత్తిపోతలు, గోదావరి నదిపై బ్రిడ్జి, మెడికల్ కాలేజీ భవనం శంకుస్థాపనలు, సింగరేణి, వ్యవసాయం, అన్నింటినీ వృద్ధి చేస్తున్నారు.

–ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్



వేదికపై కేసీఆర్, సుమన్, దివాకర్‌రావు, ఐకే రెడ్డి



చెక్కు అందజేస్తున్న కేసీఆర్, సీఎస్ శాంతికుమారి

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

చెన్నూరు ఎత్తిపోతల పథకం, మందమర్రిలో పామాయిల్ ఫ్యాక్టరీ, గడిపేట ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణానికి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అప్‌గ్రెడేషన్, మంచిర్యాల–అంతర్గాం గోదావరి నదిపై వంతెన నిర్మాణాల శంకుస్థాపనలకు సంబంధించిన శిలాఫలకాలను సీఎం ఆవిష్కరించారు.

చెక్కుల అందజేత

కలెక్టరేట్ వేదికగా సీఎం కేసీఆర్ బీసీల్లోని కులవృత్తి, చేతివృత్తిదారుల వారికి ఆర్థికసాయం పథకం, రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం, ఇళ్ల జాగాలేని నిరుపేదలైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమాలను సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. కోటపల్లి మండలం వెలమపల్లికి చెందిన కుందారపు మురళి, భీమారానికి చెందిన మామిడి సత్యనారాయణకు ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు లక్ష రూపాయల చెక్కును అందించారు. తాదూరు మండలం ఖాజీపేట గ్రామానికి చెందిన ఆవుల వెంకటేష్, బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన గొలవేణి ఓదేలులకు గొర్రెల పంపిణీకి సంబంధించిన పత్రాలను సీఎం అందజేశారు. హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన బిరుదుల లక్ష్మి, తోటపల్లి లావణ్యలకు ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు.

చదువుల తల్లికి ప్రోత్సాహం

వేమనపల్లి మండలం చామనపల్లికి చెందిన శ్రీరాముల హరిత ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఫస్టియర్‌లో 470కు 468 మార్కులతో స్టేట్ ఫస్ట్ వచ్చింది. ఈ అమ్మాయిని సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆమెను ఘనంగా సన్మానించి ఐఏఎస్ కావాలని దీవించారు. ఇంకా ఉన్నత చదువులు చదుకోవాలని ఆశీర్వదించారు. ఆమె ఉన్నత చదువులకు రూ.5 లక్షలు ఆర్థిక సహాయాన్ని సీఎం కేసీఆర్ ప్రకటించారు.

సభ హైలెట్స్

- శుక్రవారం సాయంత్రం 5:17గంటలకు కేసీఆర్ హెలికాప్టర్ ద్వారా కలెక్టరేట్‌కు రాక.
- అక్కడి నుంచి నేరుగా కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక బస్సులో నస్పూర్‌లోని బీఆర్ఎస్ భవన్‌కు చేరిక.
- 5:26 గంటలకు బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం.
- 5:40 గంటలకు తిరిగి అదే బస్సులో కలెక్టరేట్‌కు చేరిక.
- 6గంటలకు కలెక్టరేట్ ప్రారంభం.
- 7:12గంటలకు బహిరంగ సభకు కేసీఆర్

సైడ్‌లైట్స్

- కేసీఆర్ హెలికాప్టర్‌లో వచ్చే సమయానికి సభలో చాలా కుర్చీలు ఖాళీగా ఉండడంతో పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఆందోళన చెందారు.
- కేసీఆర్ సభకు వచ్చే ముందు వేలాది మందితో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో గులాబీశ్రేణులు ఊపిరి పీల్చుకున్నారు.
- సీఎం భద్రత దృష్ట్యా సభ ప్రాంగణానికి ఉత్తరం వైపు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో అటు వైపు నుంచే భారీగా వచ్చిన జనాలు లోపలికి రావడానికి ఇబ్బంది పడ్డారు. దీంతో ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు కాస్త ఆగ్రహం వ్యక్తం చేయడంతో పోలీసులు బారికేడ్లను తొలగించారు.
- సభలో మేదరికుల సంఘ సభ్యులు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేస్తూ చాటలపై రాసి చూపించారు.
- సీఎం సభ ప్రారంభానికి ముందు రాష్ట్ర సమాచార శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాతో దృశ్యాలను చిత్రీకరించే ప్రయత్నం చేయగా సీఎం సెక్యూరిటీ, పోలీసులు అడ్డుకున్నారు.



చాటలతో అభిమానం చాటుకున్న మేదరులు

- సీఎం మాట్లాడుతుండగా కొందరు విజిల్స్ వేస్తూ అల్లరి చేస్తూ ఉండగా సీఎం కల్పించుకుని సీటీలు వేసేటోళ్లు మనోళ్లు కారు.. వాళ్లను నివారించండి అంటూ సీఎం అనడంతో సభలో నవ్వులు వెల్లివిరిశాయి. సీటీలు, చప్పట్లు కొట్టాలంటే అంతా అయ్యాక కొట్టండి అంటూ సీఎం హితవు పలికారు.
- సాంస్కృతిక సమాఖ్య కళాకారులతో కలిసి గిడ్డంగుల శాఖ చైర్మన్ సాయిచంద్ సీఎం కేసీఆర్‌పై ప్రసంశల జల్లులతో పాటలు పాడుతూ సభలో జోరు పెంచారు.
- సభావేదికపై ఉన్న కేసీఆర్‌కు శిశు, సంక్షేమ శాఖా మాజీ ఆర్గనైజర్ అత్తి సరోజ నుదుటన కుంకుమ పెట్టి రక్షణ కంకణాన్ని కట్టారు.
- ధరణి ఉండాలా? వద్దా? ఉండాలే అనే వారు చేతులెత్తండి అని కేసీఆర్ అనడంతో సభకు హాజరైన జనాలంతా చేతులెత్తి సంఘీభావం తెలిపారు.
- నాకన్నా ముందు దొడ్డ సీఎంలు, పాడవు సీఎంలు పని చేశారు. వారెవ్వరు రైతులను పట్టించుకోలేదని ధరణిని ఉద్దేశించి కేసీఆర్ అనగా సభలో నవ్వులు పూశాయి.

– మంచిర్యాలరూరల్(హాజీపూర్)/ శ్రీరాంపూర్/నస్పూర్

న్యూస్‌రీల్

జాబితా విడుదల

ఆసిఫాబాద్‌అర్బన్: నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో కాంట్రాక్ట్, ఒప్పంద ప్రాతిపదికన ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల నియామకానికి 1:3 నిష్పత్తిలో కౌన్సెలింగ్ జాబితాను విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంతోపాటు https://asifabad.telangana.gov.in వెబ్‌సైట్‌లో జాబితాను చూసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఈ నెల 12న ఉదయం 10 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

కార్పొరేట్ తరహాలో స్మార్ట్ బోధన



మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ విద్యాబోధన అందిస్తున్నట్లు డీఈవో అశోక్ తెలిపారు. ఆసిఫాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాలోని 22 ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ప్లాన్ ప్యానల్ బోర్డు అందించిన నూతన టెక్నాలజీ విధానంపై అవగాహన కల్పించారు. డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని 22 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి స్మార్ట్ బోధన అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. సెక్టోరియల్ అధికారులు సుభాష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కు అందిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, తదితరులు

ఆసిఫాబాద్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో శుక్రవారం సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ రాజేశం, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ఆయన హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆసరా పింఛన్లు అందిస్తూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు.. షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి పథకాలతో పేదింటి ఆడపిల్లలకు అండగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులతో కలిసి రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీసీ కులవృత్తిదారులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.లక్ష ఆర్థికసాయం పథకాన్ని ప్రారంభించి, ఐదుగురు లబ్ధిదారులకు చెక్కులు అందించారు. అలాగే మైనార్టీశాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారుకు మంజూరైన వాహనం, కెరమెరి మండలానికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీలు నాగేశ్వర్‌రావు, అజయ్ కుమార్, సంతోష్, అధికారులు పాల్గొన్నారు.

సీఐ సార్ బాధపడ్తుండు!

- 'సాక్షి' క్లిప్పింగ్‌ను తొలగించండి
- వాంకిడి మీడియా ప్రతినిధులకు ఓ బీఆర్ఎస్ నేత ఫోన్లు
- వైరల్‌గా మారిన నకిలీ నోట్ల కథనం
- దొంగనోట్ల నిందితుడి తరఫున మధ్యవర్తిత్వం వహించిన నేత
- రూ.30 లక్షలకు డీల్ కుదిరినట్లు సమాచారం

సాక్షి, ఆసిఫాబాద్: వాంకిడి మండలంలో 'నకిలీ నోట్ల కేసు కంచికి!' అనే శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. ఉదయం నుంచి ఇదే కథనం స్థానికుల్లో చర్చనీయాంశమైంది. స్థానిక మీడియా ప్రతినిధులు కొందరు తమ వాట్సాప్ గ్రూపుల్లో 'సాక్షి' క్లిప్పింగ్‌ను పోస్టు చేయడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో స్థానిక అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి కుమారుడు రంగంలోకి దిగి మీడియా ప్రతినిధులతో మంతనాలు జరపడం గమనార్హం. నకిలీ నోట్ల కేసు నీరుగార్చే అంశంలో ఆయనే కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది.

ఆ డీల్ విలువ రూ.30 లక్షలు..

వాంకిడికి చెందిన హిమ్రే తిరుపతి ఏప్రిల్ 24న నకిలీ కరెన్సీతో పోలీసులకు పట్టుపడిన విషయం తెలిసిందే. అదేరోజు నిందితుడు తిరుపతి తనకు సన్నిహితంగా ఉండే ఓ వ్యక్తికి 'నన్ను ఈ కేసు నుంచి తప్పించండి. ఎంతైనా ఇస్తాను' అని తెలుపగా.. సదరు ప్రజాప్రతినిధి కుమారుడు రంగంలోకి దిగి నిందితుడి తరఫున మధ్యవర్తిత్వం వహించి పోలీసులకు భారీ మొత్తంలో లబ్ధి చేకూర్చినట్లు సమాచారం. ఈ డీల్‌లో రూ.30 లక్షలు చేతులు మారినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రజాప్రతినిధి కుమారుడు ఈ కేసు వ్యవహారంలో అంతా తానై నడిపించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అవీ ఇలాంటి కేసులే కదా..!

వాంకిడి మండలం బెండారాకు చెందిన మాజీ ఎంపీటీసీ ఉషా, సామెలాకి చెందిన నాగభూషణం ఐదారేళ్ల కిందట నకిలీ కరెన్సీ తీసుకొస్తూ కాగజ్‌నగర్ పోలీసులకు పట్టుపడ్డారు. అయితే వారికి ఆ కేసులో మూడు నెలలయినా బెయిల్ దొరకలేదు. అలాగే గోయగాంకి చెందిన గఫార్ సైతం నకిలీ నోట్లతో మహారాష్ట్రలోని నాగపూర్ పోలీసులకు చిక్కాడు. ఈ కేసులో అతనికి నేటికీ బెయిల్ లభించలేదు. పదేళ్లుగా జైల్లోనే మగ్గుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మరి అలాంటి నేరానికే పాల్పడిన హిమ్రే తిరుపతికి మాత్రం స్టేషన్ బెయిల్ సెక్షన్‌తో స్థానిక పోలీసులు ఎందుకు సరిపెట్టారనే ప్రశ్న తలెత్తుతోంది. స్థానికంగా ప్రచారం జరుగుతున్నట్లుగానే పోలీసులకు భారీగా ముడుపులు అందినట్లు భావించాల్సి వస్తుందనే వాదనలు గుప్పుమంటున్నాయి. స్థానికంగా చాలా మంది పత్తి వ్యాపారులు పంట కొనుగోళ్ల సమయంలో రైతులకు ఇచ్చే డబ్బులో నకిలీ నోట్లు పెట్టి ఇస్తున్నారని, దీనిపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు నిఘా పెట్టాలని వారు కోరుతున్నారు.

ప్లీజ్.. ఆ క్లిప్పింగ్ తొలగించండి

శుక్రవారం ఉదయం నుంచి సోషల్ మీడియాలో 'సాక్షి' కథనం వైరల్ అవుతుండటంతో స్థానిక ప్రజాప్రతినిధి కుమారుడు కొందరు మీడియా ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. 'సాక్షిలో వచ్చిన కథనాన్ని సాక్షి రిపోర్టర్ పోస్టు చేయాలి. కానీ మీరంతా ఎందుకు ఆ కథనాన్ని ఇతర గ్రూపుల్లో వైరల్ చేస్తున్నారు. దయచేసి సోదరులారా ఆ క్లిప్పింగ్‌ను ఆయా గ్రూపుల నుంచి మీరు తొలగించండి. పాపం సీఐ సారు బాధపడ్తుండు. ఆయనకు డిపార్టుమెంట్‌లో చెడ్డపేరు వస్తుంది. ప్లీజ్ నా మాట వినండి. పోస్టు తొలగించండి..' అంటూ వేడుకున్నట్లు వినికిడి. జరిగిన వాస్తవంపై 'సాక్షి'లో కథనం వస్తే బీఆర్ఎస్ నేత ఎందుకంతా పరేషాన్ అవుతున్నాడో అర్థం కాక స్థానికులు తికమక పడుతున్నారు.

ఆటో, కారు ఢీ: ఇద్దరు మృతి

- ఆరుగురికి తీవ్రగాయాలు
- రెబ్బెన మండలం పులికుంట వద్ద ఘటన

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం పులికుంట సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ఆటో, కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కాగజ్‌నగర్‌కు చెందిన మువ్వ శ్రీధర్ తన తల్లి మాలతికి హైదరాబాద్‌లో శస్త్రచికిత్స చేయించి శుక్రవారం సోదరి సునీతతో కలిసి కారులో ఇంటికి బయలుదేరారు. వీరితోపాటు మరో ఇద్దరు చిన్నారులు కారులో ఉన్నారు. అలాగే బెల్లంపల్లి పట్టణంలోని 65 డీప్ ఏరియాకు చెందిన ఆటో డ్రైవర్ ఎండీ దస్తగిరి(45) ఆటోలో ప్రయాణికులతో రెబ్బెన వైపు నుంచి తాండూర్ వైపు వెళ్తున్నాడు. గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. ఇద్దరు పిల్లలతో కలిసి మొత్తం ఏడుగురితో బెల్లంపల్లి వైపు పయనమయ్యాడు. ఈ క్రమంలో పులికుంట సమీపంలో ఎదురుగా వస్తున్న కారు, దస్తగిరి నడుపుతున్న ఆటో బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోతోపాటు కారులో ఉన్న ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. తీవ్ర రక్తస్రావంతో దస్తగిరితోపాటు అదే ఆటోలో ఉన్న రేపల్లెవాడకు చెందిన రాంసింగ్ (58) మంచిర్యాలలో మృతి చెందాడు.



ఘటన స్థలంలో ఆటో, కారు

బతుకుదెరువు కోసం వచ్చి..

బతుకుదెరువు కోసం మధ్యప్రదేశ్ నుంచి వచ్చి కూలీ పనులు చేసుకుంటున్న రాంసింగ్‌ను రోడ్డు ప్రమాదం పొట్టన పెట్టుకుంది. రాంసింగ్ తాండూర్ మండలం రేపల్లెవాడలో కుమారుడితో కలిసి ఉంటున్నాడు. స్వగ్రామానికి వెళ్లి వస్తూ రెబ్బెనలో ఆటో ఎక్కగా.. పులికుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.

క్షతగాత్రులు వీరే..

ఈ ప్రమాదంలో రెబ్బెన మండలం కైరిగూడకు చెందిన మినుగు చిలుకమ్మ, గోలేటికి చెందిన వడాయి నానుబాయి, మహారాష్ట్రలోని గుగ్గూస్‌కు చెందిన అరుణారాణి, మువ్వ మాలతి, శ్రీధర్, సునీత తీవ్రంగా గాయపడ్డారు. పిల్లలకు కావాల్సిన యూనిఫాం, స్కూల్‌బ్యాగులు కొనేందుకు నానుబాయి, చిలుకమ్మ బెల్లంపల్లికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. అదే ఆటోలో ఉన్న అరుణారాణి తన కూతురుతో కలిసి వెళ్తుండగా గాయపడ్డారు. చిన్నారులకు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న రెబ్బెన ఎస్సై భూమేష్ సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో క్షతగాత్రులను ప్రైవేటు అంబులెన్స్‌ల్లో ఆసుపత్రులకు తరలించారు. నానుబాయి, చిలుకమ్మని మొదట రెబ్బెన పీహెచ్‌సీకి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికి తరలించగా, అరుణారాణిని మంచిర్యాలకు తరలించారు.



దస్తగిరి (ఫైల్)



గాయపడిన చిలుకమ్మ

ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోండి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన వారు ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష ఆర్థికసాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ అధికారి సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ధ్రువపత్రాలను జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో లేదా ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

క్లుప్తంగా

దర్జాగా విద్యుత్ చౌర్యం



విద్యుత్ కోసం తీగలకు తగిలించిన కొండీలు

కోటపల్లి: రూ.22లక్షలతో వెంచపల్లిలో నిర్మిస్తున్న ఫారెస్ట్ భవనం కోసం కాంట్రాక్టర్ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నాడు. భవన నిర్మాణం పూర్తయ్యేవరకూ కాంట్రాక్టర్ విద్యుత్ తీగలకు కొండీలు తగిలించి చౌర్యానికి పాల్పడుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లును సంప్రదించగా.. విద్యుత్ చౌర్యం జరిగినట్లు తమ దృష్టికి రాలేదని, త్వరలోనే సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఒకరికి జీవితఖైదు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని బాబేఝరి గ్రామానికి చెందిన శ్రీనివాస్ హత్య కేసులో బూత పోచయ్యకు జీవితఖైదు, రూ.3వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ఎంవీ రమేశ్ శుక్రవారం తీర్పునిచ్చారు. జిల్లా లైజన్ అధికారి ఎండీ బషీర్, కెరమెరి ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. 19.12.2020న బాబేఝరి గ్రామానికి చెందిన టేకం శ్రీనివాస్‌తో కలిసి భూత పోచయ్య ఆటోలో కెరమెరికి వెళ్లి మద్యం సేవించాడు. తిరుగు ప్రయాణంలో హట్టి వద్ద తాను ఆటో నడుపుతానని పోచయ్య కోరగా శ్రీనివాస్ ఒప్పుకోలేదు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఈక్రమంలో కోపంతో పోచయ్య శ్రీనివాస్‌పై దాడి చేశాడు. టవల్‌తో ఊపిరాడకుండా చేయగా శ్రీనివాస్ మృతి చెందాడు. అతడి భార్య భీంబాయి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. 26 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో పోచయ్యకు జీవితకాలం జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించారు.

పెరటిలో శిశువు మృతదేహం

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలోని పెరటిలో శిశువు మృతదేహం లభించినట్లు ఎస్సై విజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో నెలలు నిండని శిశువు మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని గుర్తు తెలియని వ్యక్తుల పనిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

దాడి చేసిన వారికి జరిమానా

భీమిని: వెంకటాపూర్ దాడి ఘటనలో శుక్రవారం బెల్లంపల్లి మెజిస్ట్రేట్ ఇరువురికి రూ.5వేల జరిమానా విధించారు. వివరాలు.. గ్రామానికి చెందిన తోట తిరుపతిపై 2015లో పుట్ట చందు, పుట్ట మల్లయ్య పొలం సరిహద్దు విషయంలో కట్టెలు, గొడ్డలితో దాడి చేశారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో పుట్ట చందు, మల్లయ్యకు రూ.2,500 చొప్పున బెల్లంపల్లి సివిల్ మెజిస్ట్రేట్ జడ్జి ముఖేశ్ జరిమానా విధించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఆసిఫాబాద్‌రూరల్: కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. వివరాలు.. శుక్రవారం బూర్గుడ నుంచి ఆసిఫాబాద్‌కు ప్రశాంత్, వేణుగోపాల్ బైక్‌పై వెళ్తున్నారు. ఆసిఫాబాద్ భారత్‌గ్యాస్ గోదాం వద్ద జిల్లా కేంద్రం నుంచి ఎదురుగా వస్తున్న కారు వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ప్రశాంత్, వేణుగోపాల్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు పంపించారు. కాగా, చికిత్స పొందుతూ వేణుగోపాల్ మృతి చెందాడు.



సీఎం కేసీఆర్‌కు వేంకటేశ్వరుడి చిత్రపటం బహూకరిస్తున్న కలెక్టర్ సంతోష్



సీఎం కేసీఆర్ నుదుట తిలకం దిద్దుతున్న నాయకురాలు



సభలో లైవ్ డ్రాయింగ్ వేస్తున్న చెన్నూర్‌కు చెందిన పోశన్న



వేదికపై నృత్యం చేస్తున్న కళాకారులు

ప్రగతి నివేదన సభ సక్సెస్

సీఎం కేసీఆర్ శుక్రవారం మంచిర్యాలలో పర్యటించారు. సమీకృత కలెక్టరేట్, బీఆర్ఎస్ కార్యాలయ భవనాలు ప్రారంభించారు. బీసీ కుల వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం, గృహలక్ష్మి పథకాలను లాంచ్ చేశారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నస్పూర్‌లో ఏర్పాటు చేసిన మంచిర్యాల జిల్లా ప్రగతి నివేదన బహిరంగ సభలో ప్రసంగించారు. జనం అధికసంఖ్యలో హాజరై సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపించింది.



బతుకమ్మతో ప్రగతి నివేదన సభకు హాజరైన మహిళలు



బహిరంగ సభ వేదికపై ఉత్సాహంగా బీఆర్ఎస్ మహిళా నాయకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



పోటీలు ప్రారంభిస్తున్న దేవేందర్, సిరాజ్

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు అద్భుత ఆటతీరును ప్రదర్శించి సత్తా చాటాలని బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ సూచించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉరు రెహమాన్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతమైన గోలేటిలో రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణతో ఈ ప్రాంతంలో చెస్ క్రీడకు మరింత ఆదరణ పెరుగుతుందని పేర్కొన్నారు. ఏరియాలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సింగరేణి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. మూడురోజుల పాటు కొనసాగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. క్రీడాకారులంతా క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ పోటీల్లో రాణించేందుకు కృషి చేయాలని, నిరంతర సాధనతో క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని పేర్కొన్నారు. చెస్‌తో క్రీడాకారుల్లో ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెస్ చైర్మన్ కనకయ్య, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ఇన్‌చార్జి ఎస్వోటూ జీఎం విజయ్‌కుమార్ ఇందా, రెబ్బెన ఎస్సై భూమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఉపేందర్, గోపీకృష్ణ, సర్పంచ్ సుమలత, కోశాధికారి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంతా ఏకమై ఊరినే కాపాడారు..!

- అగ్ని ప్రమాదంలో రెండిళ్లు దగ్ధం
- రూ.10లక్షల ఆస్తి నష్టం



మంటల్లో కాలిపోయిన ఇల్లు

వేమనపల్లి: అర్ధరాత్రి సమయం.. ఇల్లు కాలుతూ మంటలు ఎగిసి పడుతుండడంతో ఏం చేయాలో బాధితుడికి తోచలేదు. ఒక్కసారిగా వేసిన కేకలతో చుట్టుపక్కల ఇళ్లలోని వారంతా మేల్కొన్నారు. అంతా ఏకమై ఎగిసిపడుతున్న మంటలపై నీళ్లు చల్లి చుట్టుముట్టకుండా ఊరినే కాపాడారు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామంలో గురువారం రాత్రి 11గంటల సమయంలో చోటు చేసుకుంది. మాజీ జెడ్పీటీసీ తుమ్మిడె లచ్చయ్య పెద్ద కుమారుడు బాబాజీ తన భార్యాపిల్లలతో కలిసి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఖర్జీ గ్రామంలో శుభకార్యానికి వెళ్లారు. చిన్న కుమారుడు సురేశ్ గురువారం రాత్రి గ్రామంలోని దుకాణం వద్దకు వెళ్లాడు. లచ్చయ్య, ఆయన భార్య బాయక్క ఇంటి ఆరుబయట నిద్రించారు. రాత్రి 11గంటల సమయంలో ప్రమాదవశాత్తు లచ్చయ్య, బాబాజీ ఇళ్లకు మంటలు అంటుకున్నాయి. దుకాణం నుంచి వచ్చిన సురేశ్ మంటల్లో కాలిపోతున్న ఇళ్లను చూసి కేకలు వేశాడు. నిద్రలోంచి మేల్కొన్న తల్లిదండ్రులు, ఇరుగు పొరుగు వారు పోగయ్యారు. గ్రామస్తులు ఏకమై మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైరింజన్‌కు ఫోన్ చేసినా సమయానికి అందలేదు. ఇరుగు పొరుగు వారి ఇళ్లలో ఉన్న విద్యుత్ మోటార్లను ఆన్ చేసి మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తూ చుట్టుపక్కలకు వ్యాపించకుండా చూశారు. అగ్నికీలలు ఇళ్లు, గడ్డివాములపైకి రాకుండా నీళ్లు పోశారు. దీంతో పెను ప్రమాదమే తప్పింది. అప్పటికే రెండిళ్లు కాలిపోగా రెండు తులాల బంగారం, 20తులాల వెండి, రూ.32వేల నగదు, ఇళ్లలోని సామగ్రి, ధాన్యం కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.10లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఎంపీటీసీలు సంతోష్‌కుమార్, బాబు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్ఐ లక్ష్మణ్ సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా చేశారు.

అరెస్టులపై నల్ల బ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: సీఎం పర్యటనను పురస్కరించుకొని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందంతోపాటు ఇతర నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడాన్ని కాంట్రాక్ట్ కార్మికులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పట్టించుకోని సీఎం కేసీఆర్ తమపై అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని చెప్పిన కేసీఆర్ కనీసం వినతిపత్రం స్వీకరణకు అనుమతించకుండా అక్రమంగా పోలీసులతో అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు బీ యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టి ట్రాక్టర్ బోల్తా



రోడ్డుపై బోల్తాపడ్డ ట్రాక్టర్

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గంగాపూర్ గ్రామానికి వెళ్లే రహదారిపై శుక్రవారం బైక్‌ను ఢీకొట్టి ట్రాక్టర్ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన వైపు నుంచి గంగాపూర్‌కు వెళ్తున్న ట్రాక్టర్ ఎదురుగా గంగాపూర్ నుంచి రెబ్బెన వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న గుర్లె నవీన్‌కు నడుము భాగంలో తీవ్ర గాయాలుగా కాగా, ట్రాక్టర్ డ్రైవర్ పెరుగు నవీన్ తలకు గాయాలయ్యాయి. వెంటనే వీరిని బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న రెబ్బెన ఎస్సై భూమేశ్ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించి రోడ్డుపై అడ్డంగా పడి ఉన్న ట్రాక్టర్‌ను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసు నమోదు విషయమై ఎస్సైతో మాట్లాడే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

పీఆర్టీయూ మాసపత్రిక చీఫ్ ఎడిటర్‌గా ఇన్నారెడ్డి



ఇన్నారెడ్డిని సన్మానిస్తున్న శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్ రావు, రఘోత్తంరెడ్డి

మంచిర్యాలఅర్బన్: పంచాయతీరాజ్ ఉపాధ్యాయ మాసపత్రిక తెలంగాణ స్టేట్‌కు చీఫ్ ఎడిటర్‌గా పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్‌లో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అనేక అంశాలపై తీర్మానం చేయడంతో పాటు ఇన్నారెడ్డిని పత్రిక చీఫ్ ఎడిటర్‌గా నియమించారు. అనంతరం అతడిని సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్నారెడ్డి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించినవారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఐటీడీఏ నర్సరీ పునఃప్రారంభం



పనులు పరిశీలిస్తున్న సందీప్‌కుమార్

భీమారం: మండల కేంద్రంలో ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీని అధికారులు పునఃప్రారంభించారు. మామిడి మొక్కల పెంపకం పనులను శుక్రవారం ఐటీడీఏ హార్టికల్చర్ అధికారి సందీప్‌కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది 25వేల మామిడి మొక్కలకు అంటుకట్టే పనులు చేపడతామని, ముస్ముందు సంఖ్య మరింత పెంచుతామని పేర్కొన్నారు. నర్సరీ ద్వారా గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. నర్సరీ ఇన్‌చార్జి, టెక్నికల్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

కొనసాగిన ఫిష్ ఫుడ్‌ఫెస్టివల్



చేపవంటలను తిలకిస్తున్న స్థానికులు

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని జెడ్పీఎస్‌హెచ్ బాలుర పాఠశాల మైదానంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్‌ఫెస్టివల్ రెండోరోజు కొనసాగింది. శుక్రవారం మహిళా మత్స్యకార సొసైటీల ఆధ్వర్యంలో చేపలతో వివిధ వంటకాలు చేసి స్థానికులకు పరిచయం చేశారు. మత్స్యకార కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని జిల్లా మత్స్యకార అధికారులు లలిత, రామ్‌దాల్ తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు

కాగజ్‌నగర్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న మంచిర్యాలలోని బాలుర పాఠశాల మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.శేఖర్ తెలిపారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. అండర్-17 (స్త్రీ-పురుషులు), అండర్-14, అండర్-12 (బాల-బాలికలు) విభాగాల్లో పోటీలుంటాయని పేర్కొన్నారు. ఉదయం 7.30నుంచి 8.30 గంటల వరకు బరువు, వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, క్రీడాకారులు ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వారై ఉండాలని తెలిపారు. ఒరిజినల్ ఆధార్‌కార్డు, ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 7గంటలకే రిపోర్ట్ చేయాలన్నారు. వివరాలకు 99635 39234 నంబర్‌లో టోర్నమెంట్ ఆర్గనైజర్, కోచ్ సీహెచ్ రాజేశ్‌ను సంప్రదించాలని సూచించారు.

భూతగాదాలో తొమ్మిది మందిపై కేసు

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో జరిగిన భూతగాదాలో ఈనెల 7న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని 98 సర్వే నంబర్‌లో మహ్మద్ ఫిరోజ్ హుస్సేన్ ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఈస్థలంపై కొంతకాలంగా ఇరువర్గాల మధ్య తగాదాలున్నాయి. ఈ నెల 5న ఫిరోజ్ హుస్సేన్ నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద ఉండగా అక్కడికి వచ్చిన తొమ్మిదిమంది అతడితోపాటు కుటుంబసభ్యులపై దాడి చేశారు. పెప్పర్ స్ప్రేను ఫిరోజ్ కళ్లలో కొట్టారు. మరో మహిళ ఆస్మా బేగంపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఫిరోజ్ హుస్సేన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఖమ్మం జిల్లాలో ఎక్సైజ్ సీఐగా విధులు నిర్వహిస్తున్న జుల్ఫికర్ అహ్మద్, మంచిర్యాల జిల్లాలో బీసీ సంక్షేమాధికారిగా పని చేస్తున్న మొహిసిన్ అహ్మద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న శంషీర్ అహ్మద్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు అఫ్తాబ్ అహ్మద్, అబ్రార్ అహ్మద్, అమెర్ అహ్మద్, అబ్రార్ అహ్మద్, ఇస్రార్ అహ్మద్, సాహెరా బేగం, సురయా సుల్తానాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఎన్‌హెచ్‌ఏఐ ఆర్వోను కలిసిన ఎన్‌హెచ్ బాధితులు



వివేక్ వెంకటస్వామి, రఘునాథ్‌తో కలిసి ఆర్వో జాన్‌బాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సిద్ధంచేసిన అలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించాలని శుక్రవారం హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్‌ఏఐ రీజినల్ అధికారి కార్యాలయంలో ఆర్వో జాన్‌బాజ్‌ను ఎన్‌హెచ్ బాధితులు కోరారు. మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్‌వెంకటస్వామి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లితో కలిసి వినతిపత్రం అందజేశారు. లక్సెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండలాల పరిధిలో జాతీయ రహదారి విస్తరణ విషయంలో మరోసారి పరిశీలన జరిపి విలువైన భూములు, ఇండ్లు కోల్పోకుండా చూడాలని కోరారు. కాగా, పరిశీలించి నష్టం జరగకుండా చూస్తామని ఆర్వో జాన్‌బాజ్ హామీ ఇచ్చినట్లు ఈ సందర్భంగా ఎన్‌హెచ్ బాధితులు తెలిపారు.